క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 8790996090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చినకంచిలో శివకల్యాణం



నున్న(విజయవాడరూరల్): చినకంచి దేవస్థానముల బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం శివకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 131వ జయంతి కార్యక్రమం వైభవంగా జరిగింది. 11 మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహించి లక్ష మల్లెలతో అర్చన చేశారు. నీరాజన, మంత్ర పుష్పాదులు జరిగాయి. 10 మంది వేద పండితులతో సంపూర్ణ కృష్ణయజుర్వేద పారాయణం జరిగింది. భాష్య ప్రవచనము, సంగీత కచేరి, తీర్థప్రసాద వినియోగానంతరం వేదస్వస్తి నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎం పీఎస్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ ఏరియా, పాత్ల బజారు, కొల్ల ఫారమ్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంఈఓ కార్యాలయానికి నోటు, పాఠ్యపుస్తకాలు



ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కాకముందే మండల విద్యాశాఖ కార్యాలయానికి నోట్ పుస్తకాలు వచ్చాయి. అన్ని తరగతుల విద్యార్థులకు అవసరమైన 21,588 నోటు పుస్తకాలు పంపారు. నోటు, పాఠ్యపుస్తకాలను ఎంఈఓ-2 సాంబశివరావు శుక్రవారం పరిశీలించారు. 8,9,10 తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా వచ్చాయని, మిగిలిన వాటిని త్వరలో పంపనున్నారని ఎంఈఓ తెలిపారు.

అన్నదాతకు ఊరట

- మిచాంగ్ తుపాను బాధితులకు పరిహారం అందజేత
- రూ.101 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 93,531 మంది రైతులకు ప్రయోజనం

తొలగిన అడ్డంకులు.. ఖాతాల్లోకి నగదు



పామర్రులో పంట నష్టం వివరాలను తెలుసుకుంటున్న అధికారులు(ఫైల్)

సాక్షి, మచిలీపట్నం: అన్నదాతకు ఊరట లభించింది. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన వారికి ఉపశమనం కలిగింది. మిచాంగ్ తుపాను కారణంగా పంట దెబ్బతిన్న రైతాంగానికి ఆర్థిక సహాయం అందింది. ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయడంతో అన్నదాత మోములో చిరునవ్వు వచ్చింది. కృష్ణా జిల్లాలో సుమారు 93,531 మంది అన్నదాతలకు ప్రయోజనం చేకూరగా వీరి కోసం రూ.101కోట్లు విడుదల చేశారు.

గత ఏడాది మిచాంగ్ కన్నెర్ర..

కృష్ణా జిల్లాలో 2023 డిసెంబర్ 3వ తేదీ నుంచి 6 వరకు కురిసిన మిచాంగ్ తుపాను వర్షాల వల్ల ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి. 2023లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, వేరు శనగతో పాటు పత్తి పంటలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ స్థాయి, మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ఎన్యూమరేషన్ కమిటీ ఏర్పాటు చేశారు. మిచాంగ్ తుపాను వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతుల జాబితాలు గ్రామాల వారీగా తయారు చేసి, పంట నష్ట పరిహారం కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అలాగే జిల్లాలో తుపాను కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల రైతులను కూడా ఆదుకునేందుకు ప్రతిపాదనలు పంపించారు.

నియోజకవర్గం పేరు	రైతుల సంఖ్య	ఇన్‌పుట్ సబ్సిడీ (రూ. లక్షల్లో)
మచిలీపట్నం	7,791	865.84
పెడన	16,826	1544.09
అవనిగడ్డ	23,285	2315.71
గుడివాడ	6,929	714.54
పామర్రు	21,301	2511.12
పెనమలూరు	5,870	797.36
గన్నవరం	11,529	1354.21
మొత్తం	93,531	101,02.87

జిల్లాలో లబ్ధి ఇలా..

మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు మార్చి 6వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు కదిలారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో 58,835.56 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినడంతో 92,318 మంది రైతులకు నష్టం వాటిల్లింది. వీరికి పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. వాస్తవానికి మార్చిలోనే ఈ ప్రక్రియ చేపట్టగా.. ఎన్నికల కోడ్ కారణంగా బ్రేక్ పడింది.

రైతుల ఖాతాల్లోకి రూ. 101 కోట్లు

మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.101కోట్లు విడుదల చేసింది. రూ. 99.90 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ సాధారణ రైతులకు, 462.42 హెక్టార్లతో ఉద్యాన పంటలు నష్టపోయిన 1,209 మంది రైతులకు రూ.1.12 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ.. మొత్తం 93,531 మంది రైతులకు రూ. 101.02 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. అలాగే 2023 మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు 164.84 హెక్టార్లలో జొన్న, మొక్కజొన్న పంటలు కోతకు గురయ్యాయి. పంట నష్టానికి 138 మంది రైతులకు రూ.41.21 లక్షల పరిహారం వారి ఖాతాల్లోకి జమ చేశారు. అయితే ఆన్‌లైన్ ప్రక్రియ నెమ్మదిగా ఉండడంతో కొంత మందికి ప్రాసెస్‌లో ఉంది.

నేరుగా రైతుల ఖాతాలోకే..



మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పరిహారం అందించింది. వీరితో పాటు 2023 మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పంట కోతకు గురయిన అన్నదాతలకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో వారి ఖాతాలోనే నగదును జమ చేసింది. అయితే ఆన్‌లైన్ ఇబ్బందులతో కొందరికీ.. సరైన ఆధార్, బ్యాంకు ఖాతాలు ఇవ్వని మరికొందరు రైతులకు ఇంకా నగదు పడలేదు. అలాంటి వారికి ఒకటి రెండు రోజుల్లో జమ అవుతాయి.

– ఎస్. పద్మావతి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

రూరల్‌లో రూ. 8.74 కోట్ల ఉపాధి పనులు



చెరువు అభివృద్ధి పనులు చేస్తున్న ఉపాధికూలీలు

విజయవాడరూరల్: ఈ ఏడాది విజయవాడరూరల్ మండలంలో రూ. 8.74 కోట్ల విలువైన ఉపాధి పనులను నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించినట్లు మండల ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ పి.శ్రీనివాసరావు తెలిపారు. నున్న గ్రామంలో జరుగుతున్న పంటకాల్వ పనులను పరిశీలించేందుకు శుక్రవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2024-25వ సంవత్సరానికి గాను ప్రభుత్వం లక్షా 81 వేల పనిదినాలను ఉపాధి కూలీలకు కల్పించడం వల్ల రూ. 8.74 కోట్ల విలువచేసే పనులు నిర్వహించనున్నామని తెలిపారు. ఉపాధికూలీలకు పనులు కల్పించడంతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ కూడా ఉంటుందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు పంటబోదె కాల్వలు తవ్వే పనులు జరుగుతున్నాయని చెప్పారు. చెరువుల్లో పూడిక పనులు చేయడం వల్ల భూగర్భ జలాలను అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. రైతుల పొలాల్లో నీటికుంట తీయడం, మామిడితోటల్లో పాదులు చేయడం, ఉద్యానతోటలు పెంచుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసి పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం మండలంలో 8వేల మంది ఉపాధికూలీ పనులు చేసుకునేవారున్నారని, వారిలో 2,500 మంది జగనన్న కాలనీల్లో ఇంటి పనులు నిర్వహించుకునే వారున్నారని తెలియజేశారు.

అమృత సరోవర్ నిబంధనల మార్పు..

ప్రభుత్వం అమృత సరోవర్ పథకంలో చెరువులను అభివృద్ధి చేసే నిబంధనల్లో మార్పులు చేసింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన స్థలాలు ఉన్నట్టయితే వాటిల్లో చెరువులను తవ్వే విధంగా నిబంధనలు తీసుకొచ్చిందని తెలిపారు. సుమారు ఒక ఎకరం స్థలంలో చెరువు తవ్వి దానికి అందుబాటులో ఉన్న వ్యవసాయ పొలాలకు నీరు అందజేయడం, పశువులకు తాగునీటి వసతి కల్పించడం వంటి పనులు ఉపాధికూలీలతో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీలక్ష్మి తిరుపతమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన



పేరంటాలమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం లక్ష మల్లెపువ్వులతో అర్చన నిర్వహించారు. వైశాఖ పూర్ణిమ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత భక్తులతో శ్రీలలిత సహస్రనామ పూర్వక అష్టోత్తరనామ పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవ మూర్తులకు లక్ష మల్లెపువ్వులతో అర్చన చేశారు.

శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవార్లకు లక్ష పుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలో సాయంత్రం ఆరు గంటలకు మహిళలు తొలుత సామూహిక పూజలు నిర్వహించారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న మల్లెపూలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ ముగ్గురమ్మలకు లక్ష పుష్పార్చనను వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

డీఎస్పీ జయసూర్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

గన్నవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని గన్నవరం డీఎస్పీ జయసూర్య సూచించారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో శుక్రవారం పలు రాజకీయ పార్టీలు, సోషల్ మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా కౌంటింగ్ ఫలితాలు వెలువడినప్పటి నుంచి జూన్ 6వ తేదీ వరకు విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు నిషేధమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ర్యాలీలు నిర్వహిస్తే మాత్రం చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ పార్టీలు ఎటువంటి గొడవలు, అల్లర్లకు పాల్పడవద్దని సూచించారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టింగ్‌లు పెట్టవద్దని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. డైనీ డీఎస్పీ శ్రీవేద మాట్లాడుతూ.. జూన్ 6వ తేది వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. నలుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడడం, సైలెన్సర్లు లేకుండా బైక్‌లు నడపడం, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. రాజకీయ పార్టీ నేతల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎన్నికల సమయంలో కేసులు నమోదైతే అనేక ఇబ్బందులు ఎదుర్కొవలసి ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐలు శివప్రసాద్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లిలో కార్డన్ సెర్చ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని శాలివాహన కాలనీలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి నేతృత్వంలో ఎస్ఐలు ఏడీఎల్ జనార్దన్, ఎం.చిరంజీవి, పైడిబాబు, ఆర్జమ్మ, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేకపోవడంతో 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని వీరవల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు, నేరాలను అదుపు చేసేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

చురుగ్గా సమావేశ మందిరం నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న మండల పరిషత్ సమావేశ మందిరం

కంకిపాడు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన సమావేశ మందిర నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ భవనంలో పరిపాలన విభాగం, పంచాయతీ రాజ్, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అనుబంధ విభాగాలు ఉన్నాయి. కార్యాలయ నిర్వహణలో అవసరమైన సమావేశాలు, సమీక్షలకు ఉన్న సమావేశ హాలు చిన్నదిగా ఉండటంతో అసౌకర్యం నెలకొంటోంది. దీంతో గత టీడీపీ ప్రభుత్వం సమావేశ మందిరం కోసం స్థలం కేటాయించి నిర్మాణ పనులు పునాది దశలోనే నిలివేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిషత్ నుంచి రూ. 24 లక్షలు సమావేశ మందిర నిర్మాణానికి కేటాయించారు. ప్రస్తుతం భవనం శ్లాబు పనులు పూర్తయ్యాయి. నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు నిధుల సమీకరణ అవసరం. ఎన్నికల కోడ్ కారణంగా నిధుల కేటాయింపులు నిలిపివేశారు. కోడ్ అనంతరం అవసరమైన నిధులను కేటాయించి నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి మండల పరిషత్‌కు భవనం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనా స్రవంతి



విజయవాడకల్చరల్: శ్రీ వెంకటేశ్వర సంకీర్తన అకాడమీ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నమయ్య సంకీర్తనా స్రవంతి మధురంగా సాగుతోంది. శుక్రవారం నాటి కార్యక్రమంలో యువ సంగీత కళాకారులతో పాటు ప్రముఖ సంగీత విద్వాంసులు అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. అదివో అల్లదివో శ్రీహరివాసము, తిరువీధుల తిరిగే దేవదేవుడు, బ్రహ్మ మొక్కటే తదితర కీర్తనలను హైదరాబాద్‌కు చెందిన శివసాయి చరణ్, మల్లాది అనన్య, చారుమతీ పల్లవి, మల్లాది అభిజ్ఞ, మేడూరి రఘురాం, కె.గోపాలరావు, మేడూరి శివరాం, గాయత్రీ గౌరీనాథ్, సీవీవీపీ శాస్త్రి ఆలపించారు. సత్యబాబు, ప్రసాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

గంగూరులో బైక్ చోరీ

పెనమలూరు: గంగూరులో డెలివరీ బాయ్ బైక్ చోరీ జరగడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగూరు గ్రామం మసీదు రోడ్డుకు చెందిన కల్వ సాయిసంతోష్ స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తాడు. అతను ఈ నెల 14వ తేదీన పని ముగించుకుని ఇంటికి వచ్చి ఇంటి ఎదుట బైక్ పార్కు చేశాడు. మరల 15వ తేదీ ఉదయం లేచి చూసుకునే సరికి గుర్తు తెలియని వ్యక్తి అతని బైక్ చోరీ చేశారు. అతను బైక్ కోసం పలు ప్రాంతాల్లో వెతికాడు. బైక్ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ల సమ్మెతో చెత్త తరలింపు సమస్య

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ప్రైవేటు ఏజెన్సీ ద్వారా పని చేస్తున్న చెత్త తరలింపు వాహనాల డ్రైవర్లు సమ్మెకు దిగడంతో మున్సిపాలిటీ పరిధిలో చెత్త తరలింపు సమస్య ఏర్పడింది. మున్సిపాలిటీ పరిధిలోని కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప ప్రాంతాల్లో మొత్తం 45 చెత్త సేకరించే వాహనాలు ఉన్నాయి. ప్రైవేటు ఏజెన్సీ వాహనాల నిర్వహణ చూస్తుంది. అయితే వాహనాల డ్రైవర్లకు ప్రైవేటు ఏజెన్సీ గత నెల జీతాలు చెల్లించకపోవడంతో డ్రైవర్లు గత నాలుగు రోజులుగా జీతాల కోసం సమ్మె చేపట్టారు. దీంతో ఇళ్ల వద్ద చెత్త తరలింపు చేయకపోవడంతో తాడిగడప మున్సిపాలిటీ నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త సమస్య పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం వివరాలు తెలుపుతూ ప్రతి రోజూ స్వామివారికి ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. 27న రాత్రి ఏడు గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామివారికి, రమా సహిత సత్యనారాయణ స్వామివార్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 29న ఉదయం 11.30 గంటలకు భక్తులకు అన్నసమారాధన ఉంటుందని భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని అభివృద్ధి కమిటీ కోరింది.

భర్తపై వరకట్న వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి తూముల సెంటర్‌కు చెందిన పాల్వాయి ఉమారాణి తొమ్మిది సంవత్సరాల క్రితం రామకృష్ణకు కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ఏ పనులు చేయకుండా ఇంట్లోనే ఉంటూ మద్యం సేవిస్తాడు. భార్య ఉమారాణి విజయవాడలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ కుటుంబ పోషణ చూస్తుంది. కాగా భర్త అదనపు కట్నం కావాలని తరచుగా మద్యం సేవించి భార్య ఉమారాణిని వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా రామకృష్ణపై కేసు నమోదు చేశారు.

ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి గ్రామోత్సవం



శ్రీవేణుగోపాలస్వామి

పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాలస్వామివారి ఆలయంలో శుక్రవారం గ్రామోత్సవం ఘనంగా చేశారు. స్వామివారి కల్యాణం గురువారం రాత్రి జరగడంతో శుక్రవారం స్వామివార్ల విగ్రహాలు ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ చేశారు.

